# రైతుల పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం

- సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్
- ఆరు నెలల్లోనే రూ. 21 వేల కోట్ల రుణమాఫీ
- మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభంలో మంత్రి పొంగులేటి



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం,సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. బుధవారం నేలకొండపల్లిలో నాచేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేస్తూ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు.నాడు వరి వేస్తే ఉరి అన్న పాలకులకు భిన్నంగా, నేడు సన్న వడ్ల సాగును ప్రోత్సహిస్తూ మద్దతు ధరతో పాటు అదనంగా రూ. 500 బోనస్ చెల్లిస్తున్నామని ప్రకటించారు. రైతులు పండించిన పంటను విక్రయించిన వెంటనే, ఆలస్యం లేకుండా వారి ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నామని వివరించారు.

**మాట నిలబెట్టుకున్న రేవంత్ సర్కార్**

ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు ఇచ్చిన ప్రతి మాటను ప్రభుత్వం నెరవేరుస్తోందని పొంగులేటి స్పష్టం చేశారు. గత పాలకులు ఐదేళ్లలో చేయలేని రుణమాఫీని, తమ ప్రభుత్వం కేవలం ఆరు నెలల్లోనే రూ. 21 వేల కోట్లు విడుదల చేసి 25 లక్షల మంది రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేసిందని గుర్తు చేశారు. గతంలో రైతు బంధు కింద రూ. 10 వేలు అందిస్తే, ప్రస్తుతం రైతు భరోసా ద్వారా రూ. 12 వేలు అందిస్తున్నామన్నారు.

**విస్తృతంగా గోదాముల నిర్మాణం**

రైతులు పండించిన పంటను భద్రపరుచుకునేందుకు వీలుగా రాష్ట్రంలో గోదాముల సామర్థ్యాన్ని 200 శాతం మేర పెంచేలా కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. ప్రైవేటు రంగానికి దీటుగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కోల్డ్ స్టోరేజీలను నిర్మించి త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుల జారీ వంటి అనేక సంక్షేమ పథకాలను అప్పుల భారం ఉన్నప్పటికీ చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# అమర్నాథ్ యాత్రకు వెళ్లే వారికి ఫిట్నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** అమర్నాథ్ యాత్రకు వెళ్లే యాత్రికులు తప్పనిసరిగా ఆరోగ్య ఫిట్నెస్ సర్టిఫికేట్ పొందాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. యాత్రికులు తమ ఆరోగ్య పరిస్థితి, వయస్సు, శారీరక సామర్థ్యాన్ని జి జి హెచ్ కొడంగల్ నియమించిన వైద్యుల ద్వారా పరీక్షించించుకొని ఫిట్నెస్ సర్టిఫికేట్ పొందాలి. యాత్రికులు ఆధార్ కార్డు, గుర్తింపు కార్డు, ఇటీవల పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో ఇతర అవసరమైన (ఆరోగ్య చికిత్స పత్రాలతో ) సంప్రదించండి. తప్పనిసరి ఫిట్నెస్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. ఫిట్నెస్ సర్టిఫికెట్స్ జారీ చేయు స్థలం డిస్ట్రిక్ట్ ఆసుపత్రి తాండూరు. ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ఇతర వివరాల కోసం 9491738499 కు సంప్రదించండి.

# మంగమ్మ తల్లి దర్శనం



- జాయింట్ కలెక్టర్ కుటుంబంతో హాజరు
- అధికారులు, గ్రామ పెద్దల పాల్గొనడం
- భక్తి వాతావరణంలో పూజలు

**అశ్వారావుపేట, ఏప్రిల్ 22 రాజముద్ర న్యూస్:**

బుధవారం నాడు గుబ్బల మంగమ్మ తల్లి ఆలయంలో జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శనం చేసుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో జిపిఓ వెంకటేశ్వరావు, వీఆర్ఏ రాము, వీఆర్ఏ విజయ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. భక్తుల రద్దీ మధ్య ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# ఆర్టీసీ సమ్మెకు మద్దతు




- ఎన్నికల హామీలు అమలు కాలేదని విమర్శ
- కార్మికుల సమస్యలపై ప్రభుత్వంపై ఆగ్రహం
- తక్షణ పరిష్కారం కోరిన సీఐటీయూ నేతలు

**అశ్వారావుపేట, ఏప్రిల్ 22 రాజముద్ర న్యూస్:**

అశ్వారావుపేటలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతు ప్రకటిస్తూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు చేయక పోవడం వల్లే సమస్యలు పెరిగాయని, దీనికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సుందరయ్య భవనంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. సమ్మె ఉధృతంగా కొనసాగుతున్న సమయంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్ల పేరుతో పోలీసుల సహాయంతో బస్సులను రోడ్డుపైకి తేవడం సరైన విధానం కాదని అన్నారు. ఆర్టీసీని పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేయాలని, రద్దైన కార్మిక సంఘాలను తిరిగి పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. రెండో వేతన సవరణ పీఆర్సీ అమలు చేయడంతో పాటు విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కేసుపాక నరసింహారావు, నందు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దందా వడ్డీ గుట్టు.!

- పల్లెల్లో అక్రమ వడ్డీ వ్యాపారాల విస్తృతి
- రైతులను లక్ష్యంగా దోపిడీ ఆరోపణలు
- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం




**అశ్వారావుపేట, ఏప్రిల్ 22 రాజముద్ర న్యూస్:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని పల్లెలు, గిరిజన గ్రామాల్లో అక్రమ వడ్డీ వ్యాపారాలు విస్తరించాయన్న చర్చలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. అవసరంలో ఉన్న రైతులు, పేద ప్రజలను లక్ష్యంగా చేసుకుని అధిక వడ్డీలతో డబ్బులు ఇచ్చి తిరిగి భారీ వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో చిక్కుకుంటున్నాయని గ్రామాల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. అప్పు ఇచ్చి పీడించడం, తిరిగి చెల్లింపుల సమయంలో ఒత్తిడి తేవడం వంటి విధానాలు పెరిగిపోయాయని స్థానికులు చెబుతున్నారు. లైసెన్సులు లేకుండా, పన్నులు చెల్లించకుండా అక్రమ మార్గంలో వ్యాపారాలు కొనసాగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలు వసూలు చేయడం, అదనంగా కమిషన్ల పేరుతో డబ్బులు దండుకోవడం వంటి ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఇలాంటి అక్రమ వడ్డీ దందాలపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. జరుగుతున్న అక్రమాలపై పట్టించుకోకపోవడం వల్లే ఈ దందాలు మరింత పెరుగుతున్నాయని గ్రామాల్లో చర్చలు జరుగుతున్నాయి. అక్రమ వ్యాపారాలపై కఠిన చర్యలు అవసరమని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

తక్షణమే ఈ వడ్డీ దందాలను అరికట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా తనిఖీలు నిర్వహించి అక్రమ వడ్డీ వ్యాపారాలను పూర్తిగా నియంత్రించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామాల్లో బలమైన డిమాండ్ వినిపిస్తోంది.

# అంబలి సేవ ప్రారంభం

- న్యాయవాదులకు ఉచిత పంపిణీ
- వేసవిలో ఆరోగ్యంపై సూచనలు
- ప్రముఖుల పాల్గొనడం



**ఖమ్మం, ఏప్రిల్ 22 రాజముద్ర న్యూస్:**

ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ హాల్ వద్ద ఈసీ మెంబర్ తవనం శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో డీడీఎల్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో న్యాయవాదులకు ఉచితంగా రాగి జావ పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లా జడ్జి జి. రాజగోపాల్ కార్యక్రమాన్ని ప్రారంభించి, వేసవిలో ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# పట్టణ కుల దౌర్జన్యం

- ప్రతిపక్షంలోనే ఎక్కువ ఆరోపణలు
- పదవుల పంపకంలో వివక్ష చర్చ
- ప్రజల్లో అసహనం పెరుగుదల



**అశ్వారావుపేట, ఏప్రిల్ 22 రాజముద్ర న్యూస్:**

అశ్వారావుపేట పట్టణ రాజకీయాల్లో కుల అహంకారం మరింత పెరిగిందన్న చర్చలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీలో ఈ ధోరణి ఎక్కువైందని స్థానికంగా వినికిడి ఉంది. పట్టణ స్థాయిలోనే నిర్ణయాలు కొందరి చేతుల్లో కేంద్రీకృతమవుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రాధాన్యం తగ్గుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పదవుల పంపకంలో అగ్రవర్ణాలకే ఎక్కువ అవకాశాలు దక్కుతున్నాయని, బలహీన వర్గాల అంశాలను పక్కన పెట్టేస్తున్నారని చర్చలు జరుగుతున్నాయి. తమ సమస్యలను పట్టించుకోకుండా అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకుంటున్నారని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ రాజకీయాల్లో ఈ విధానం మరింత స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు.ప్రతిపక్ష పార్టీ పేరుతో సమానత్వం, సామాజిక న్యాయం గురించి మాట్లాడినా, వాస్తవంలో కుల ప్రభావం ఎక్కువగా కనిపిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. అవసరానికి బలహీన వర్గాలను వాడుకుని తర్వాత పక్కన పెడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది రాజకీయ విశ్వాసాన్ని దెబ్బతీస్తోందని ప్రజలు అంటున్నారు.పట్టణంలో నెలకొన్న ఈ పరిస్థితిపై ప్రజల్లో అసహనం పెరుగుతోంది. ఎవరి అంశాలు వారు చెప్పినా పట్టించుకోకపోవడం, అడ్డగోలుగా వ్యవహరించడం వల్ల అసంతృప్తి మరింత పెరుగుతోందని చర్చలు వినిపిస్తున్నాయి. సరైన సమయంలో ప్రజలే ఓటు ద్వారా స్పందిస్తారని బలహీన వర్గాల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఆర్టీసీ సమ్మెకు మద్దతు

- బీఆర్ఎస్ సంఘీభావం ప్రకటింపు
- కార్మికుల డిమాండ్లకు మద్దతు
- ప్రభుత్వంపై విమర్శలు



**సత్తుపల్లి, ఏప్రిల్ 22 రాజముద్ర న్యూస్:**

సత్తుపల్లి ఆర్టీసీ డిపో వద్ద కొనసాగుతున్న సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ మద్దతు ప్రకటించింది. మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ సమ్మె స్థలాన్ని సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎన్నికల హామీలు అమలు కాకపోవడం, 42 రోజులుగా స్పందన లేకపోవడం విమర్శలకు దారితీస్తోందన్నారు. సమ్మెకు ప్రజల మద్దతు పెరుగుతోందని పేర్కొంటూ, బీఆర్ఎస్ ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వార్షిక మొబిలైజేషన్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో కొత్రేపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఫైరింగ్ ప్రాక్టీస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ క్షేత్రస్థాయిలో ఆయుధాల పనితీరును పరిశీలిస్తూ, వివిధ రకాల తుపాకులతో స్వయంగా ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. పోలీసు సిబ్బందికి ఆయుధ వినియోగంలో ఖచ్చితత్వం, వేగం, సమన్వయం ఎంత ముఖ్యమో వివరించిన ఎస్పీ ఫైరింగ్ సమయంలో అనుసరించాల్సిన భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో, ఒత్తిడిలో కూడా సమర్థవంతంగా స్పందించేందుకు ఇటువంటి శిక్షణలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు అధికారులు, సిబ్బంది తమ వృత్తిపరమైన నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆయుధాల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండటం ప్రతి పోలీసు సిబ్బందికి అవసరమని పేర్కొన్నారు. ప్రజల భద్రతే పోలీసుల ముఖ్య లక్ష్యం కావడంతో, ఎప్పటికప్పుడు తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. వార్షిక మొబిలైజేషన్ శిక్షణల ద్వారా సిబ్బంది శారీరక ధారుఢ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు మానసిక ధైర్యం, క్రమశిక్షణ, సమయపాలన వంటి లక్షణాలు అభివృద్ధి చెందుతాయని ఎస్పీ తెలిపారు. పోలీసు విభాగం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ ఫైరింగ్ ప్రాక్టీస్ కార్యక్రమంలో జిల్లా ఏఆర్ డిఎస్పీ వీరేష్, ఆర్ఐ నాగరాజు, శ్రీశైలం, ఆర్ఎస్ఐలు, వివిధ యూనిట్లకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేకాట దాడి

- అనంతారం గ్రామ శివారులో దాడి
- నలుగురు అదుపులో.. 6100 నగదు స్వాధీనం

**అశ్వారావుపేట, ఏప్రిల్ 22 రాజముద్ర న్యూస్:**

విశ్వసనీయ సమాచారం మేరకు అశ్వారావుపేట మండలంలోని అనంతారం గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఎస్సై టి యయాతి రాజు తన సిబ్బందితో కలిసి దాడి చేసి అక్కడ పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.దాడి సమయంలో వారి వద్ద నుండి మొత్తం 6100 రూపాయల నగదు, పేక ముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పేకాట నిర్వహణపై ముందస్తు సమాచారం అందడంతో వేగంగా స్పందించిన పోలీసులు ఈ దాడిని విజయవంతంగా పూర్తి చేశారు.అదుపులోకి తీసుకున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు. మండలంలో అక్రమ కార్యకలాపాలపై నిరంతరంగా కట్టడి చర్యలు కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

